సాక్షి
ఏలూరు
ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



పార్శిల్ శవం.. తేలని నిజం

ఉండి మండలం యండగండికి చెందిన ఓ మహిళ ఇంటికి పార్శిల్‌లో వచ్చిన మృతదేహం గుర్తింపులో పోలీసులు తలమునకలయ్యారు.

8లో



నిందితుడి అరెస్టు

ఏలూరులోని రామకృష్ణాపురంలో ఆర్వోబీ వద్ద వ్యక్తి హత్య కేసుకు సంబంధించి నిందితుడు నానిని పోలీసులు అరెస్ట్ చేశారు.

8లో



ఖోఖో పోటీలు ప్రారంభం

ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో నన్నయ వర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల ఖోఖో పోటీలు, వర్సిటీ జట్టు సెలెక్షన్స్ నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

చట్టాలపై నైపుణ్యం పెంచుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్

ఏలూరు (టూటౌన్): మారుతున్న చట్టాలపై న్యాయమూర్తులు అవగాహన పెంచుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ పిలుపునిచ్చారు. ఏలూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులకు ఒక రోజు శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పురుషోత్తంకుమార్ మాట్లాడుతూ శిక్షణా తరగతిలో ఫ్రేమింగ్ ఆఫ్ చార్జెస్, సెక్షన్ 311, 313, 319 సీఆర్‌పీసీ, బాధితులు-పరిహారం మొదలైన చట్టాలపైన అవగాహన కల్పించామన్నారు. రిసోర్స్ పర్సన్‌లుగా వైవీ రామకృష్ణ, జీవీ కృష్ణయ్య, ఏపీ సురేష్, ఎం.సునీల్‌కుమార్ వ్యవహరించారు. న్యాయమూర్తులు పాల్గొన్నారు.

జీతాల కోసం ఆందోళన



జీజీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జీజీహెచ్ వద్ద రెండో రోజు కార్మికులు, నాయకులు ధర్నా చేశారు. చాలీచాలనీ వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకుంటే వారంతా రోడ్డున పడే దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.దత్తాత్రేయ పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ కమిటీలు ఏకగ్రీవం

ఏలూరు(మెట్రో): జిల్లా సాగునీటి యాజమాన్య కమిటీలకు సంబంధించిన రెండు ప్రాజెక్ట్ కమిటీ (పీసీ)లకు చైర్మన్, వైస్ చైర్మన్‌ల పదవులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈ చిలకపాటి దేవప్రకాశ్ తెలిపారు. శనివారం తమ్మిలేరు ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు చాట్రాయిలో, ఎర్రకాల్వ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు జంగారెడ్డిగూడెంలో నిర్వహించగా చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమ్మిలేరు ప్రాజెక్ట్ కమిటీకి చైర్మన్‌గా యర్ర రమేష్, వైస్ చైర్మన్‌గా గుండా వెంకన్న, ఎర్ర కాల్వ ప్రాజెక్ట్ కమిటీకి చైర్మన్‌గా వందనపు అంజ నాగ వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా వాడపల్లి రాధాకృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈ సీహెచ్ దేవప్రకాశ్ తెలిపారు.

'ఓపెన్' ఫీజులు చెల్లించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ అభ్యాసకులు పబ్లిక్ పరీక్షలకు ఫీజులు చెల్లించాలని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి 31 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

డీఎంహెచ్‌ఓగా మాలిని

ఏలూరు టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ)గా డాక్టర్ ఆర్.మాలిని నియమితులయ్యారు. కృష్ణా జిల్లా గుడివాడ ఏరియా ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్న ఆమెను ఇక్కడకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఏలూరు డీఎంహెచ్‌ఓగా ఉన్న డాక్టర్ శర్మిష్టను కృష్ణా జిల్లా డీఎంహెచ్‌ఓగా ప్రభుత్వం బదిలీ చేసింది.

27న యువ ఉత్సవ్

ఏలూరు(మెట్రో): జిల్లాలో యువత ప్రతిభను వెలికి తీసేందుకు ఈనెల 27న యువ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె యువ ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదిత్య డిగ్రీ కాలేజీలో వేడుకల్లో భాగంగా పలు పోటీలు నిర్వహిస్తామన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ వివరాలకు సెల్ 99488 98437లో సంప్రదించాలని కోరారు.

ముగిసిన డీఆర్పీల శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన జ్యోతి పేరిట స్థానిక సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ)లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసిందని కోర్స్ డైరెక్టర్, డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

27న 'విజయకేతనం' అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఈనెల 27న విజయ కేతనం పేరున స్టడీ మెటీరియల్ అందిస్తామని డీఈఓ తెలిపారు.



ద్వారకాతిరుమల : సంద్రకుంటలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత



కైకలూరు : కైకలూరులో బైక్ ర్యాలీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్

సంక్షేమ సారథీ.. వర్ధిల్లు వెయ్యేళ్లు

జననేతకు నీరా'జనం'

- వండుగలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు
- సేవా కార్యక్రమాలతో అభిమానం చాటిన పార్టీ శ్రేణులు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు
- పేదలకు దుప్పట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు

జనాభిమానం ఉప్పొంగింది. సేవా సంబరం అంబరాన్నంటింది.. సంక్షేమ సారథి.. అభివృద్ధి వారధికి ఊరూవాడా నీరా'జనాలు' అర్పించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.



బుట్టాయగూడెం: దొరమామిడిలో వృద్ధులకి దుస్తులు, నగదు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



నూజివీడు : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు



ఏలూరు టౌన్ : పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్రంలో సంక్షేమ పాలనతో తనదైన ముద్ర వేసుకుంటూ దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించిన సంక్షేమ రథసారథి.. భవిష్యత్ తరాలకు బాటలు వేస్తూ విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన దార్శనికుడు.. పారిశ్రామిక అభివృద్ధికి నాంది పలుకుతూ పోర్టుల నిర్మాణం, రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఇలా అన్నివర్గాల అభ్యున్నతిని ఆకాంక్షిస్తున్న నిత్య కృషీవలుడు, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా సాగాయి. ఊరూవాడా వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించారు. గత ప్రభుత్వంలో చేకూరిన సంక్షేమ లబ్ధిని ప్రజలు గుర్తుచేసుకుని మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ.. వెయ్యేళ్లు వర్ధిల్లు.. నూరేళ్లు జీవించు.. అని మనసారా దీవించారు.

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కైకలూరు నియోజకవర్గంలో ఆటపాక నుంచి కైకలూరు వరకు మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, ముదిరాజు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, నాయకులు పాల్గొన్నారు.
- ద్వారకాతిరుమల మండలంలోని సంద్రకుంట, గొల్లగూడెంలో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి తానేటి వనిత హాజరై కేక్ కట్ చేశారు. ద్వారకాతిరుమలలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల్లో పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు.
- పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బుట్టాయగూడెంలో కేక్ కట్ చేసి ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కొయ్యలగూడెం మండలం సీతంపేట ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులు జగన్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.
- ఏలూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. దివ్యాంగుల హోమ్‌లో చిన్నారులకు భోజనాలు అందించారు. ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.
- చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు జంగారెడ్డిగూడెం, చింతలపూడి ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. చింతలపూడిలో అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. కామవరపుకోటలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు.
- ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు మండలం పత్తేపురంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. చేబ్రోలు జగనన్న కాలనీలో పార్టీ శ్రేణులు వేడుకలు చేశారు.
- దెందులూరు నియోజకవర్గంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో జగన్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి.



దెందులూరు : దోసపాడులో కేక్ కట్ చేస్తున్న నాయకులు



జంగారెడ్డిగూడెం : కేక్ కట్ చేస్తున్న సమన్వయకర్తలు కారుమూరి సునీల్‌కుమార్, కంభం విజయరాజు



నిడమర్రు: పత్తేపురంలో పేదలకు దుప్పట్లు పంచుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ

అలుపెరుగని యోధుడు జగన్



ఏలూరులో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీలు వంకా, కవురు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి, జెడ్పీటీసీలు, నాయకులు

ఏలూరు టౌన్: రాష్ట్ర రాజకీయాల్లో ధీరుడుగా, అలుపెరుగని పోరాట యోధుడిలా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా ఉన్నారని ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులో జెడ్పీ సమావేశానికి హాజరైన అనంతరం వారంతా ఇండోర్ స్టేడియం గేట్ సమీపంలో జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, జెడ్పీటీసీలతో కలిసి ఎమ్మెల్సీలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసి చూపించిన ఏకైక నాయకుడు జగన్ మాత్రమే అని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. సూపర్-6 అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. భవిష్యత్తు అంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్లు పెనుమాల విజయబాబు, పోతిన శ్రీలేఖ, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, నిట్టా లీలానవకాంతం, తుమ్మగుంట భవానీ, కే.వెంకట కాశీ విశ్వనాథ్, కే.జయలక్ష్మి, దేవరపు సోమలక్ష్మి, మొడియం రామతులసీ, ఎం.వసంతరావు, ఎస్.బాలసూర్యనారాయణరాజు, ఎం. నీరజ, హరనాథ్‌రాజు, రమేష్, నాగేశ్వరరావు, రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

కువైట్‌లో ఘనంగా వేడుకలు



కువైట్‌లో మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ప్రవాసాంధ్రులు

నరసాపురం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కువైట్‌లో నరసాపురానికి చెందిన ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. కువైట్ హవల్లీలోని ఆర్‌ఆర్ స్పైసీ పేరుతో నడుస్తున్న ఇండియా రెస్టారెంట్‌లో వేడుకలు జరిగాయి. నరసాపురానికి చెందిన ఈదా రాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు వ్యాపారవేత్త, కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా ప్రజా సంక్షేమం పట్టించుకోకుండా మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈదా రాజు మాట్లాడుతూ కువైట్‌లోని ప్రవాసాంధ్రులు రోజూ జగన్ పాలనను గుర్తుచేసుకుంటున్నారని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్‌ను గెలిపించుకుంటామని ఆంధ్రప్రదేశ్ ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు. ప్రవాసాంధ్రులు వి.నరసారెడ్డి, నాయని మహేశ్వరరెడ్డి, గోవింద్ నాగరాజు, కావేటి రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడి.. ఫిరాయింపుపై మండిపడి

- జెడ్పీ చైర్‌పర్సన్‌ను నిలదీసిన జెడ్పీటీసీలు
- ఉమ్మడి జిల్లాపరిషత్ ప్రత్యేక సమావేశం
- అవిశ్వాస తీర్మానం నోటీసు చెల్లదన్న సీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. పార్టీ మారాల్సిన అవసరం ఏముందంటూ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఆమె గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీలో చేరడంపై ఇప్పటికే 30 మందికి పైగా జెడ్పీటీసీలు అవిశ్వాస తీర్మానం కోరుతూ సీఈఓకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శనివారం ఏలూరు జెడ్పీ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి సీఈఓ ఆర్.విజయరాజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 38 మంది జెడ్పీటీసీలు హాజరు కాగా 36 మంది వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలే ఉన్నారు. ఒకరు టీడీపీ, మరొకరు జనసేన జెడ్పీటీసీలు హాజరయ్యారు.

మహిళలకు జగన్ పెద్దపీట

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత ప్రభుత్వ హయాంలో మహిళలకు పెద్దపీట వేస్తూ పద్మశ్రీని జిల్లాపరిషత్ పీఠంపై కూర్చోబెట్టారని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు అన్నారు. పార్టీకి నమ్మక ద్రోహం చేయడం తగదన్నారు.

సీఈఓని నిలదీసి..

సింగిల్ అజెండాగా పొందుపర్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుపై సభ ప్రారంభంలోనే జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఫ్లోర్‌లీడర్, జెడ్పీటీసీలు పెద్దిరాజు, గోవిందరాజులు నిలదీశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల్లో నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టడం కుదరదని జెడ్పీ సీఈఓ చెప్పారు. ఈ కారణంగా అవిశ్వాస తీర్మానం నోటీసు వీగిపోయినట్లేనని సమాధానమిచ్చారు. సమావేశం మినిట్స్‌లో ప్రతిదీ పొందుపరచి, దాని నకలు కాపీని తమకు అందించాలని జెడ్పీటీసీలు కోరగా.. ప్రతిదీ మినిట్స్ బుక్‌లో పొందుపరుస్తామని, సదరు కాపీని పంచాయతీరాజ్ కమిషనర్‌తో పాటు సభ్యులకు అందజేస్తామని సీఈఓ స్పష్టం చేశారు.

40 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీలోనే..

పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్



ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా, ఆశలు చూపినా, బెదిరింపులకు పాల్పడినా ఇప్పటికీ 40 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు అన్నారు. మొత్తం 48 మంది సభ్యుల్లో ఒక స్థానం ఖాళీగా ఉందని, మిగిలిన 47 మందిలో 45 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు ఉన్నారన్నారు. ఇందులో ఐదుగురు సభ్యులు కూటమి వైపు వెళ్లినా.. 40 మంది వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామన్నారు. ప్రత్యేక సమావేశానికి 36 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు హాజరుకాగా నలుగురు వివిధ కారణాలతో రాలేదన్నారు. అందరూ ఏకాభిప్రాయంతోనే ఉన్నామన్నారు.

పదవినీ వదిలేయాలి



చింతలపూడి నీరజ, జెడ్పీటీసీ

మహిళగా ఘంటా పద్మశ్రీకి జగన్ అత్యున్నత స్థానం కల్పించారని చింతలపూడి జెడ్పీటీసీ చింతలపూడి నీరజ అన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉంటే ప్రజలకు సేవ చేయలేం, నిధులు తీసుకురాలేమన్నది దురభిప్రాయమన్నారు. పార్టీ మారడం జెడ్పీ చైర్‌పర్సన్ విజ్ఞతకే వదిలేశామని, ఆమె పార్టీ ఫిరాయించడం బాధాకరమన్నారు. పార్టీ అక్కరలేనప్పుడు దాని ద్వారా వచ్చిన పదవిని కూడా ఆమె వదిలేయాలని అన్నారు.

క్లుప్తంగా

నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టు



ఫోర్జరీ కేసులో అరెస్టయిన కుంచె మురళి తులసీధర్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. పాలకొల్లు ఏరియా ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంచె మురళి వెంకట తులసీధర్‌ను ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, చెక్కుల ఫోర్జరీ కేసులో అరెస్టు చేసినట్లు తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓ.రవికుమార్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి సుమారు రూ.62 లక్షల వరకు నిధులను దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో తేల్చారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఉండి: అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్తింటివారు వేధింపులకు గురి చేస్తున్నారని మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన ఇళ్ళ ధనలక్ష్మికి పెరవలికి చెందిన సత్యనారాయణతో 2011లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నంగా ఇచ్చారు. వ్యసనాలకు బానిసైన సత్యనారాయణ మరో రెండు లక్షలు అదనంగా కట్నం కావాలని వేధింపులకు గురి చేసేవారు. వేధింపులకు అత్తింటి వారు మద్దతుగా నిలిచారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: గంజాయి కలిగి ఉన్న నేరంపై ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని పెదతాడేపల్లి ఇరిగేషన్ పుంత వద్ద అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద 270 గ్రాముల గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. నిందితులు గణేష్‌నగర్‌కు చెందిన చించిలి హర్షవర్ధన్, మరొకరిని మైనర్‌గా గుర్తించారు.

పార్శిల్ శవం.. తేలని నిజం

ఉండి: ఉండి మండలం యండగండికి చెందిన తులసి అనే మహిళ ఇంటికి పార్శిల్‌లో వచ్చిన మృతదేహం గుర్తింపులో పోలీసులు తలమునకలయ్యారు. ఆ శవం ఎవరిది? ఎవరు పంపారు.. యండగండిలో తులసి ఇంటికి ఆ బాక్స్‌ను ఎందుకు పంపారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు నాలుగు బృందాలు పనిచేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ఈ కేసు ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఆ విషయాన్ని మాత్రం పోలీసులు ఇంకా ధృవీకరించడం లేదు. గురువారం సాయంత్రం ఓ కారులో చెక్కపెట్టెతో పాటు ఒక మహిళను సమీప గ్రామమైన ఉణుదుర్రు పరిధిలో రోడ్డుపై దింపినట్లు సమాచారం. అక్కడ నుంచి ఆ మహిళ రోడ్డుపై వెళ్లే ఆటోను మాట్లాడి యండగండి రాయపేటలోని ముదునూరి రంగరాజు ఇంటికి పార్శిల్‌ను చేర్పింది. ఆ మహిళ ఎవరు? ఆమెను,

ఆస్తి కోసం అక్కాచెల్లెళ్ల గొడవలపై పోలీసుల దృష్టి

శవంతో ఉన్న చెక్కపెట్టెను కారులో దించింది ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తండ్రికి ఉన్న సుమారు మూడున్నర ఎకరాల పొలం కోసం అక్కాచెల్లెళ్ళ మధ్య గొడవలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

అనుమానితుడి ఫోన్ సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు

చిన్న కుమార్తె భర్తగా చెబుతున్న వ్యక్తిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం నుంచి అతని ఆచూకీ లేకపోవడంతో అతనిపై నిఘా ఉంచారు. చిన్న కుమార్తె భర్త స్వస్థలం మొగల్తూరు అని చెప్పగా.. పోలీసుల విచారణలో మాత్రం అతని స్వగ్రామం కాళ్ళ మండలం ఇస్కోలులంక అని తెలిసింది. తనకు వివాహం కాలేదని చెప్పి రంగరాజు చిన్నకుమార్తెతో సహజీవనం చేస్తున్నట్లు తెలిసింది. అతనికి అంతకముందే వివాహమైనట్లు పోలీసుల పరిశీలనలో తేలింది. అతని ఆచూకీ లభించకపోవడంతో అతని తల్లిదండ్రులను దర్యాప్తు కోసం పిలిపించినట్లు సమాచారం. అనుమానితుడి ఫోన్ కాల్ చివరి సిగ్నల్ తెలంగాణా రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉండటంతో పోలీసులు అటువైపు దృష్టి సారించారు. శనివారానికి అనుమానితుడి సిగ్నల్ సమీపంలోని జిల్లాలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక చెక్కపెట్టెలో పార్శిల్‌గా వచ్చిన మృతదేహానికి సంబంధించి ఎలాంటి ఆచూకీ లభించలేదు. 32 నుంచి 35 ఏళ్ల వయసున్న వ్యక్తిని సుమారు 3 రోజుల క్రితం ప్లాస్టిక్ తాడుతో ఉరివేసి చంపినట్లు తెలుస్తుంది. మూడు రోజుల క్రితమే శవాన్ని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పార్శిల్ చేసినట్లు అనుమానిస్తున్నారు.

మొక్కుబడిగా జెడ్పీ సమావేశం

- 17 మంది జెడ్పీటీసీలు మాత్రమే హాజరు
- 30 మంది వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు బాయ్‌కాట్

ఏలూరు (టూటౌన్): శనివారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశానికి.. 47 మంది జెడ్పీటీసీలు హాజరు కావాల్సి ఉండగా కేవలం 8 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఎలాగైనా సర్వసభ్య సమావేశం నిర్వహించి తీరాలనే కూటమి నాయకుల పట్టుతో చివరకు 17 మంది జెడ్పీటీసీలు సమావేశానికి హాజరయ్యారు. ఇందులో ముగ్గురు సభ్యులు సంతకాలు చేసి బయటకు వెళ్లిపోయారు. 30 మంది వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు బాయ్‌కాట్ చేశారు. కేవలం 14 మందితోనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కొనసాగించారు. 42 అంశాలపై చర్చించాల్సి ఉండగా..



మధ్యాహ్నం 2.30 గంటలకు ఖాళీగా కన్పిస్తున్న సమావేశ మందిరం

కేవలం ఐదారు అంశాలపైనే చర్చ జరిగింది. జిల్లా కలెక్టర్ సైతం మొక్కుబడిగా వచ్చారు. కనీసం ఒక్క ఎంపీపీ కూడా హాజరు కాలేదు. ఇదీ శనివారం ఏలూరు జెడ్పీ సమావేశ మందిరంలో సర్వ సభ్య సమావేశం జరిగిన తీరు. సమావేశానికి అధ్యక్షత వహించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యా ప్రమాణాల స్థాయి పెంపుదలకు విద్య శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు గత ఏడాది అందించిన విధంగానే విజయ కేతనం సిలబస్ పుస్తకాలను అందించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సమావేశంలో జెడ్పీటీసీలు తెలిపిన సమస్యలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కుదింపు కారణంగా ఉన్న వారిపై అదనపు భారం పడిందన్నారు. విద్యార్థుల నమోదుకు ఉద్దేశించిన ఆపార్ మంచిదే కానీ వివరాల నమోదులో జరిగే పొరబాట్లకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయకుండా చూడాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి సీఈఓ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా పంకజ్ కుమార్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా కురెళ్ళ పంకజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ స్థానంలో గత జూన్ వరకూ సోమశేఖర్ పని చేసేవారు. ఆయన పదవీ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఈ స్థానంలో ప్రస్తుతం కైకలూరులోని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పంకజ్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ఏలూరు టౌన్: ఏలూరులోని రామకృష్ణాపురం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద వారం క్రితం బెగ్గర్ రాజు అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసును త్రీటౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు ఛేదించారు. నిందితుడు నానిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతను గతంలో ఒక కేసులో నిందితుడిగా ఉన్నట్లు చెబుతున్నారు. త్రీటౌన్ స్టేషన్‌లో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. బ్రిడ్జి 39వ పిల్లర్ ప్రాంతంలో కనకరాజు అలియాస్ బెగ్గర్‌రాజు, నాగమణి దంపతులు గతంలో ఉండేవారు. వీరికి ముగ్గురు కుమార్తెలుండగా కనకరాజు ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 2016లో భార్య మృతిచెందింది. పెద్ద కుమార్తెను ఏలూరు రూరల్ వెంకటాపురం ప్రాంతానికి చెందిన నాని అనే యువకుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. పెళ్ళి చేయమని కనకరాజును వేధిస్తూ ఉండగా నానితో గొడవ జరిగింది. భార్య మృతితో కనకరాజు నారాయణపురం గ్రామానికి మకాం మార్చాడు. ఈ నెల 13న కనకరాజు ఏలూరు వచ్చాడు. నాని అతనితో గొడవ పెట్టుకున్నాడు. అర్ధరాత్రి సుమారు 1.30గంటల ప్రాంతంలో ఎవరూ లేని సమయంలో నాని తనతో తెచ్చుకున్న పదునైన చాకుతో కనకరాజు గొంతులో పలుమార్లు పొడిచి హత్య చేశాడు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

పశువధ ఆపేంత వరకూ పోరాటం

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి పంచాయితీ పరిధిలోని సత్యవాడ రోడ్డులో చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్న పశు వధకు జిల్లా కలెక్టర్ బాధ్యులాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రామరాజ్యం వ్యవస్థాపకుడు కొవ్వూరి వీరరాఘవరెడ్డి తెలిపారు. తణుకు ఆర్యవైశ్య భవనంలో తణుకు గోసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువధ నిర్వహిస్తున్న కర్మాగారానికి అనుమతులు లేవనే విషయం అధికారులకు తెలుసని, తణుకు తహసీల్దారు నుంచి కలెక్టరు వరకు ఫిర్యాదులు చేసినా.. కర్మాగారంలో పాడి పశువులను అత్యంత క్రూరంగా హింసించి చంపుతున్న వైనాన్ని అధికారులే ప్రోత్సహిస్తున్నారన్నారు. అధికారులు ప్రజా సేవకులని.. వారి బాధ్యతలు నిర్వర్తించని క్రమంలో సామాన్యుడు వారిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించే పరిస్థితి నూతన చట్టం ప్రకారం ఉందన్నారు. తమ కర్మాగారానికి ఎన్‌ఓసీ ఇప్పించమని నిర్వాహకులు గత నెలలో పంచాయితీకి దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇవ్వలేదని అయితే అనుమతులు లేకుండానే పశువధ నడుస్తున్నట్లుగా కాదా? అని నిలదీశారు. పశు వధ ఆపేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. రాజేష్‌నాథ్ అఘోరా మాట్లాడుతూ పశు వధ నుంచి తణుకు ప్రాంతాన్ని కాపాడుకోవడానికి రానున్న రోజుల్లో తణుకు ప్రాంతానికి అఘోరాలు రానున్నారని, ప్రజలు కూడా కలిసిరావాలని అన్నారు. కార్యక్రమంలో గోసేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్, సత్తిరాజు వెంకట సుబ్రహ్మణ్యం, జల్లూరి జగదీష్, చవ్వా శ్రీనివాసరాజు, వి.వెంకట రమ, బొద్దాని శ్రీనివాస్, పసుపులేటి సూరిపండు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరరాఘవరెడ్డి, రాజేష్‌నాథ్ అఘోరి

ఖోఖో పోటీలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సీఆర్ రెడ్డి కళాశాల క్రీడా ప్రాంగణంలో నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలకు ఖో–ఖో పోటీలు, విశ్వవిద్యాలయం జట్టు సెలక్షన్స్ శనివారం నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన సీఆర్ రెడ్డి విద్యాసంస్థల పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకు నన్నయ విశ్వవిద్యాలయంతో కలసి ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే 13 కళాశాలల జట్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అధ్యక్షత వహించారు. పోటీలకు పరిశీలకులుగా నన్నయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కే బాలు సత్యనారాయణ, సెలక్షన్ కమిటీ సభ్యులుగా కాకినాడ పీఆర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ కే దుర్గారావు, కాకినాడ డీఎస్ఏ కోచ్ డీ పాపారావు వ్యవహరించారు.



ఖోఖో పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

బాత్రూంలో విద్యార్థినుల ఫొటోల చిత్రీకరణ

- పంగిడిగూడెం హైస్కూల్‌లో ఘటన
- పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ద్వారకాతిరుమల: బాత్రూంకి వెళుతున్న విద్యార్థినులను ఇద్దరు ఆకతాయిలు చెట్టు పైనుంచి సెల్ ఫోన్‌లతో ఫొటోలు తీసిన ఘటన మండలంలోని పంగిడిగూడెం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం జరిగింది. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్లి గొడవ చేయడంతో విషయం బయటకు పొక్కింది. స్థానికుల కథనం ప్రకారం.. పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొందరు విద్యార్థినులు బాత్రూంకి వెళుతున్న సమయంలో ఆకతాయిలు చెట్టుపై నుంచి సెల్‌ఫోన్‌లతో ఫొటోలు తీయడాన్ని వారు గమనించారు. వెంటనే విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేయగా, వారంతా కలసి ఆకతాయిలను పట్టుకునేందుకు వెంబడించారు. వారు తప్పించుకుని పారిపోయారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచారు. భయాందోళనకు గురైన విద్యార్థినులు విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలిపారు. దాంతో కొందరు విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలకు భద్రత లేదంటూ పాఠశాల వద్ద ఆందోళన చేసి, ఉపాధ్యాయుల తీరుపై ధ్వజమెత్తారు. సచివాలయ మహిళా పోలీస్ బాధిత విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డ్ చేశారు. పాఠశాల విద్యాకమిటీ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే ఫొటోలు తీసిన వ్యక్తులు వేంపాడు గ్రామానికి చెందిన పెండ్లి సందీప్ కుమార్, జోనుబోయిన జితేంద్రగా గుర్తించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

భీమవరం (ప్రకాశంచౌక్): పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. భీమవరం మండలం రాయలం పంచాయతీకి సంబంధించి రూ.2.30 కోట్ల నిధులను సెక్రటరీగా పనిచేసిన ఎస్‌కెజీ కృష్ణంరాజు, డి.జయరాజు, జూనియర్ అసిస్టెంట్ సుమన్ నాగ్ దుర్వినియోగం చేశారని వారిపై భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై రెహమాన్ తెలిపారు.

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

వీరవాసరం: జిల్లాలో చైన్ స్నాచింగ్స్, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ నయిం అస్మి శనివారం వీరవాసరంలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. పోడూరుకు చెందిన కాలా రమేష్ బాబు, కడలి బాబి పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డారని.. వారి నుంచి బంగారం, 27 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చైన్ స్నాచింగ్స్, బైక్ చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీరిపై పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, వీరవాసరం, పాలకోడేరు, భీమవరం పోలీసు స్టేషనల్లో 30 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.జి జయసూర్య, సీఐ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



రికవరీ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు ధనుర్మాస పర్వదినాలను పురస్కరించుకుని వేలాదిగా భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఉభయ దేవేరులు, గోదాదేవితో శ్రీవారు తొళక్క వాహనంపై క్షేత్ర పురవీదుల్లో ఊరేగారు.



భక్తులతో నిండిపోయిన అనివేటి మండపం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి డీమార్ట్ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అన్నవరప్పాడు గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి అడ్డగర్ల సుబ్రహ్మణ్యం (45) కూరగాయల కొనుగోలుకు తణుకు కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌కు వస్తుండగా తాడేపల్లిగూడెం వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ప్రమాద ఘటనలో మృతుడి శరీరం గుర్తుపట్ట లేకుండా నుజ్జునుజ్జుగా మారిపోవడం స్థానికులను కలిచివేసింది.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలు సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి శనివారం పెదపాడు మండలంలోని వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వస్తున్న కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు వాహన యజమాని, చెరువు యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. పెదపాడు మండలంలోని తోటగూడెంలో ఎస్సై కట్టా శారదా సతీష్ నిర్వహించిన వాహన తనిఖీల్లో కోళ్ల వ్యర్థాలు తరలించిన వాహనాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



పెదపాడు మండలంలో కోళ్ల వ్యర్థాల వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు